క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



తోటపల్లిగూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఇప్పటివరకు మండలంలో 7 ఆలయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భక్తుల కోరిక మేరకు నూతన ఆలయాలను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి కాకాణికి వేద పండితులు ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, నాయకులు మద్దెన సుబ్బయ్యనాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం తథ్యం



మనుబోలు: విద్యార్థులు చదువును కష్టంగా భావించకుండా ఇష్టపడి చదివితే విజయం తథ్యమని డాక్టర్ సాయి శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శ్రీవిద్యా నికేతన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థినులు పరీక్షలకు సంసిద్ధతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల గురించి ఒత్తిడికి లోనుకాకూడదని తెలిపారు. మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని, సరిపడినంత నిద్రపోవాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ మహేశ్వరి, కరస్పాండెంట్ జగదీష్‌బాబు, గ్రామీణ వైద్యుడు పృథ్వీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు నిమ్మల చంద్రశేఖర్ ఇటీవల చెట్టుమీద నుంచి పడి మృతిచెందగా ఆయన కుటుంబానికి జిల్లా గౌడ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆదివారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని రేబాల గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్య ఆశయాలను కొనసాగిస్తూ కల్లుగీత కార్మిక బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమణయ్య, రాజా, చినగోవింద్, హజరత్, దశయ్య, రాము పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి చేయూత



పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు వెంపులూరు పెంచలనర్సయ్యగౌడ్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి చేయి విరగడంతో ఆదివారం ఆయనకు గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వారు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఉప్పల రామకృష్ణగౌడ్, యువత గౌరవాధ్యక్షుడు తాళ్ల రాజాగౌడ్, ముత్యంగౌడ్, తిరుపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు







మహాశివరాత్రిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 25 వరకు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో దేవస్థానాన్ని ముస్తాబు చేశారు. అంకురార్పణను సోమవారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవస్థాన ప్రాంగణంలో పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రథోత్సవానికి రథాన్ని తీర్చిదిద్దుతున్నారు.
– నెల్లూరు(బృందావనం)

ఏపీజీఈఏ నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లూరు నగర శాఖ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీజీఈఏ సిటీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా సతీష్‌బాబు, నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కనకాద్రి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శైలేంద్రకుమార్, కోశాధికారిగా నారాయణతో పాటు వివిధ శాఖలకు చెందిన ఏడుగుర్ని ఉపాధ్యక్షులుగా, మరో ఏడుగుర్ని సంయుక్త కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యవర్గాన్ని ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున, జిల్లా కోశాధికారి రామ్‌ప్రసాద్, తదితరులు అభినందించారు.

హిందీ ఆరాధన వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీహాల్లో హిందీ ఆరాధన వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. హిందీ ఆరాధన ప్రసంగీకులు ఉషాకిరణ్‌రాయ్, సురేష్, రెవరెండ్లు స్టీఫెన్‌జాన్, బాబుప్రసాద్, జయకుమార్‌ను సత్కరించారు. అనంతరం వాక్యోపదేశం చేశారు. సంఘ కార్యదర్శి అరుణ్‌కుమార్, జానీజో, మహేష్, దినేష్, జెన్నీ జోయల్, భారతి, శిల్పా, రాజు, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా మాట్లాడారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘాను ఉంచామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఈఓకు పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

నెల్లూరు(టౌన్): విద్యా, ఉపాధ్యాయ రంగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోహన్‌దాస్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీని మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఏపీటీఎఫ్ నేతలు హజరత్తయ్య, సురేంద్ర, ఖాదర్‌బాషా, సుభాన్, దస్తగిరి, రహంతుల్లా పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముత్తుకూరు రోడ్డులోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడారు. పోటీలకు 177 మంది క్రీడాకారులు హాజరుకాగా, వీరిలో 16 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు ఉన్నారని చెప్పారు. ఆర్‌ఎల్ చెస్ అకాడమీ నిర్వాహకులు రామ్‌లక్ష్మణ్, ఆర్బిటర్స్ వంశీకృష్ణ, వెంకటరమణ, ప్రదీప్, సుధాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు



మాట్లాడుతున్న శేఖర్

నెల్లూరు(బారకాసు): వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను ఆర్టీసీ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో నెల్లూరు రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న అందజేయనున్నామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు.

హైస్కూళ్లలో అత్యధిక మార్కులను సాధించిన వారు, రంగస్థల కళాకారులకు నగదు పురస్కారాలు, దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందజేయనున్నామని పేర్కొన్నారు. సాయం కావాల్సిన వారు 95428 30347 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. క్లబ్ సెక్రటరీ సమీవుల్లా, చైర్మన్ శేఖర్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో వీ లవ్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, ఫౌండేషన్ రీజినల్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీఈఓ



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

నెల్లూరు(అర్బన్): కలెక్టర్ చక్రధర్‌బాబును నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని సుబేదారుపేటలో పేదలకు దుప్పట్లు, మహిళలకు చీరలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ప్రభాకర్, మహేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతి



రఫీ (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓజిలి పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ రఫీ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఏడాదిగా మెడికల్ లీవ్‌లో ఉండి ఇటీవలే బైపాస్ సర్జరీని ఆయన చేయించుకున్నారు. ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, రాష్ట్ర గౌరవ సలహాదారుడు శ్రీహరి సంతాపం తెలియజేశారు.

దర్గామిట్ట ఎస్సై బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దర్గామిట్ట ఎస్సైగా రమేష్‌బాబు బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. నవాబుపేట ఎస్సైగా పనిచేస్తున్న ఆయన్ను దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసిన విషయం విదితమే.

కోడిపందేల స్థావరంపై దాడులు

ఆత్మకూరు: మండలంలోని బోయలచిరివెళ్ల శివార్లలో బొగ్గేరు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై శివశంకర్‌రావు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కోళ్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటీఎం కేంద్రాల్లో భద్రతపై పరిశీలన



సంగం: మండల కేంద్రమైన సంగంలోని ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఏటీఎం సెంటర్లలోని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..లేదాని పరిశీలించారు. ఏటీఎంల భద్రతకు సంబంధించిన వివరాలను నిర్వాహకుల నుంచి సేకరించారు. ఏటీఎం సెంటర్ల వద్ద రాత్రి గస్తీ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

ఆదాలకు సన్మానం



నెల్లూరు రూరల్: ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పలువురు విద్యార్థి విభాగ నేతలు సంఘీభావం తెలిపారు. నగరంలోని ఆదాల కార్యాలయానికి భారీ ర్యాలీగా ఆదివారం చేరుకొని ఘనంగా సత్కరించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి వేర్వేరుగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందజేత



నెల్లూరు(బృందావనం): ఇంటర్మీడియట్ విద్యార్థి శ్రీకర్‌కు రూ.23,500 ప్రోత్సాహకాన్ని నెల్లూరు – రాయల్ లియో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పొగతోటలోని క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వర్షిత, అభినవ్, కోశాధికారి నాగనందిని, చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ పాఠశాలల్లో హిందీ ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర పరీక్షలను రాస్తున్న సుమారు 400 మంది విద్యార్థులకు పెన్నులను జేసీఐ నెల్లూరు టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. సాగర్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. జేసీఐ నెల్లూరు టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, సాయిరామన్, బాలాజీ, పూర్వాధ్యక్షుడు శరణ్‌కుమార్, వెంకటమహేష్‌బాబు, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లేక్‌వ్యూ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. లేక్‌వ్యూ కాలనీలోని ఒకటో వీధికి చెందిన రమేష్‌బాబు చిన్న కుమారుడు సునీల్‌కృష్ణ (21) నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ఫైనలియర్ చదువుతున్నారు. ఈ క్రమంలో రమేష్‌బాబు, అతని భార్య, పెద్ద కుమారుడు నగరంలోని బంధువుల వివాహానికి శనివారం వెళ్లారు. ఆ సమయంలో సునీల్‌కృష్ణ ఇంట్లో ఉన్నారు. రాత్రి 11 గంటలకు వారు ఇంటికి రాగా, బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు సునీల్‌కృష్ణ ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. దీంతో దర్గామిట్ట పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ జరిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కాగా ఆత్మహత్య చేసుకునే సమయంలో సునీల్‌కృష్ణ సెల్ఫీ వీడియో తీసుకున్నారని సమాచారం. ఆత్మహత్యకు గత కారణాలు తెలియరాలేదు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు ఎముకలు, కీళ్లు, నరాలకు సంబంధించిన అవగాహన సదస్సును వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వివిధ అంశాలపై దీక్ష హాస్పిటల్స్ డాక్టర్ అన్వేష్ అవగాహన కల్పించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతినాయుడు, కోశాధికారి అనంతరామారావు, మాజీ అధ్యక్షుడు రంగారావు, శేషగిరిరావు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల స్వరాభిషేకం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఘంటసాల స్వరాభిషేకాన్ని గ్రీన్ ఫోర్స్ ట్రస్ట్, కృష్ణ కల్చరల్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంగీత, నృత్య పోటీలను జరిపి విజేతలకు బహుమతులను అందజేశారు. మురళీమోహన్‌రాజు, అడ్వొకేట్ రమాదేవి, మురళీకృష్ణ, రవి, నిర్వాహకుడు కృష్ణ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న ఘటనపై దిశ పోలీసులకు వివాహిత ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కోవూరులోని లక్ష్మీనగర్‌కు చెందిన లక్ష్మికి ఎన్నెస్సార్ కాలనీకి చెందిన పవన్ కల్యాణ్‌తో 2019లో వివాహమైంది. ఆ సమయంలో కట్న కానుకల కింద రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది.

కొద్ది రోజులుగా అదనపు కట్నం కావాలని భర్త, అత్తింటివారు ఆమె వేధింపులకు గురిచేయసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఆనంద్ భాస్కర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.